క్లుప్తంగా

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సత్యన్నారాయణ


బాధ్యతలు స్వీకరించిన సత్యన్నారాయణ

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా అర్థశాస్త్రం అధ్యాపకులు సురవరపు సత్యన్నారాయణకు పూర్తి అదనపు బాధ్యలను అధికారులు అప్పగించారు. దీంతో ఆయన శనివారం బాధ్య తలు చేపట్టారు. అధ్యాపక సిబ్బంది అభినందించారు.

అర్హులందరికీ ఉపాధి


వి.రాజ్‌కుమార్

బూర్జ: అర్హులైన వేతన దారులందరికీ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పిస్తామని మండల ఏపీవో వి.రాజ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు.లక్కుపురం గ్రామంలో శుక్రవారం ఉపాధిహామీ పనులు నిలుపుదల చేయడంతో వేతనదారులు శ్రీకాకుళం-పాలకొండ ప్రధాన రహదారిపై ధర్నా చేసిన నేపథ్యంలో ఆయన స్పందించారు. లక్కుపురం గ్రామ పంచాయతీలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్, మే నెలల్లో 379 జాబ్ కార్డుదారులకు గాను 643 మందికి 17,306 పని దినాలు కల్పించామన్నారు. ఒక్కో కుటుంబానికి సుమారు 46 రోజులు పని కల్పించామన్నారు. ఈ వారంలో 53 ఎస్సీ కుటుంబాలు పని చేస్తున్నట్టు పేర్కొన్నారు. త్వరలో అందరికీ పని కల్పిస్తామన్నారు.

తగాదాలు సృష్టించేవారిపై చర్యలు


మాట్లాడుతున్న నాగరాజు

బూర్జ: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజున తగాదాలు సృష్టించేవారిపై కఠిన చర్యలు తప్పవని బూర్జ మండల ఇన్‌చార్జి, ఆమదాలవలస ఎస్సై-2 ఐ.నాగరాజు అన్నారు. మండల కేంద్రంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులు నమ్మి గొడవలు చేయవద్దన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

స్టాక్ రిజిస్టర్లు నిర్వహించాలి


పంచాయతీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

నరసన్నపేట: మేజరు పంచాయతీలో స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని సభ్యులు కృష్ణప్రసాద్ తదితరులు సిబ్బందికి సూచించారు. నీటి పథకానికి సంబంధించి ఎన్ని మోటార్లు ఉన్నాయి, చెత్త సేకరణకు ఎన్ని వాహనాలు ఉన్నాయి, వీటిలో పనిచేసేవి ఎన్ని అనే వివరాలతో స్టాక్ రిజిస్టర్ ఉండాలని సభ్యులు కోరారు. నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్ అధ్యక్షతన శనివారం పంచాయతీ సమావేశం జరిగింది. దీంట్లో పాల్గొన్న సభ్యులు వివిధ అంశాలపై చర్చించారు. వార్డు సభ్యులు గుప్త, శ్రీధర్, బీఎల్ శర్మ, ఇప్పిలి నీలం రాజు, సీర లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చిట్టెమ్మ క్వార్టర్స్‌లో ఉచిత వైద్య శిబిరం


వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: విమలమ్మ ట్రస్ట్ సేవలు సమాజానికి ఆదర్శం కావాలని ఆమదాలవలస విశ్వసాహితి అధ్యక్షుడు పొన్నాడ వరాహ నరసింహులు మాస్టారు అన్నారు. పట్టణంలోని చిట్టెమ్మ క్వాటర్స్‌లోని షిలోహు ప్రార్థన మందిరం ఆవరణలో రాగోలు జేమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 200 మందికి వైద్యులు పరీక్షలు చేసి మందులు అందజేశారు. జెమ్స్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ శ్రీనాథ్, డాక్టర్ అలేఖ్య, ఏరియా మేనేజర్ ఎల్.శ్రీధర్, ఫార్మసిస్ట్ విశ్వనాథం, పీఆర్వో త్రినాథ్ కుమార్, పాస్టర్లు ఎస్.అసిర్ కుమార్, రాడ విజయ్ కుమార్, టి.జార్జి ముల్లర్ తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రానికి చేరిన పుస్తకాలు, బ్యాగులు

పొందూరు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగులు మండల కేంద్రానికి శనివారం చేరాయి. ఎనిమిదో తరగతికి సంబంధించి 6,800 పాఠ్య పుస్తకాలు, 35,300 నోటు పుస్తకాలు, 5,102 బ్యాగులు వచ్చాయని ఎంఈవో-2 పట్నాన రాజారావు తెలిపారు. సంబంధిత సామగ్రిని ఆయన పరిశీలించారు.

కోర్టు ఆదేశాల మేరకు బావి పనులు

కొత్తూరు: మదనాపురం పంచాయతీ వెంకటాపురంలో ప్రభుత్వ బావిని ఆదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించారు. దీనిపై గ్రామానికి చెందిన గండికోట త్రినాథరావు హైకోర్టును ఆశ్రయించారు. ఆక్రమణను తొలగించాలని కేసు వేశారు. విచారణ అనంతరం ఆక్రమణలను తొలగించాలని కోర్టు ఆదేశించింది. దీంతో అధికారులు ఆక్రమణలను తొలగించారు. ప్రజలకు ఉపయోపడేలా బావిని అధికారులు బాగు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి


జలుమూరు:మండల కేంద్రంలో పూజలు అందుకుంటున్న పంచముఖ ఆంజనేయస్వామి


సారవకోట: కేలవలసలో కల్యాణంలో పాల్గొన్న భక్తులు


ఆమదాలవలస రూరల్: అక్కులపేటలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- భక్తులకు అన్నప్రసాదం వితరణ

సారవకోట: హనుమాన్ జయంతిని వాడవాడలా భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆంజనేయస్వామి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. సారవకోట, పద్మాపురం, కేలవలస, గోపినాథపురం, అడ్డపనస, గోవర్ధనపురం, ధర్మలక్ష్మీపురం తదితర గ్రామాలలో హనుమాన్ మందిరాలలో హనుమాన్ జయంతిని నిర్వహించారు. స్వామి వారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

ఆమదాలవలస రూరల్: కామిరెడ్డిపేట, వంజంగిపేట, రామచంద్రాపురం, చిట్టివలస, కట్యాచార్యులపేట, చీమలవలస, లొద్దలపేట, ముద్దాడపేట, కలివరం, వంజంగి, అక్కులపేట గ్రామాల్లో అంజనేయస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో మేళతాళాల మధ్య స్వామికి కుంకుమార్చన, తమలార్చన వంటి పూజలు భక్తిశ్రద్ధలతో చేశారు. అన్నప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు.

సరుబుజ్జిలి: మండలంలోని పలు ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆంజనేయస్వామి వారికి ప్రీతికరమైన సిందూర అర్చనలు, తమలదళార్చనలు చేశారు. నిమ్మకాయలను దండగాచేసి స్వామికి హారంగా వేశారు. భక్తులకు అన్నప్రసాదవితరణ చేశారు. భక్తులు అధికంగా పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

జలుమూరు: మండల కేంద్రం జలుమూరుతోపాటు అల్లాడ, లింగాలవలస, శ్రీముఖలింగం, కొమనాపల్లి, చల్లవానిపేట, జోనంకి, ఉసిరికజ్వాల గ్రామాలలో హనుమాన్‌జయంతి వేడుకలు జరిగాయి. భక్తులు హనుమ చాలీసాతోపాటు వాయనందను దండకాలు పఠించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి ఉత్సవం నిర్వహించారు.


బూర్జ: దొంకలపర్తలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు


నరసన్నపేట: ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


ఆమదాలవలస రూరల్: కలివరంలో స్వామికి పూజలు


కొత్తూరులో పూజలందుకున్న స్వామివారు


సారవకోట: సారవకోటలోని హనుమాన్ మందిరంలో భక్తుల పూజలు


బూర్జ: దొంకలపర్తలో పంచముఖి ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

నరసన్నపేట: మండలంలో భక్తులు హనుమత్ జయంతిని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామాల్లో ఉన్న అభయఆంజనేయ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దపేటలో ఆంజనేయ స్వామి ఆలయంలో అష్టోత్తర కలశ స్థాపన చేసి హనుమత్ పారాయణాన్ని సత్యవరాగ్రహారానికి చెందిన రుత్వికులు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణ ప్రసాద్, పాగోటి రాజారావు, వైశ్యరాజు కేశవరాజు, పాట్నూరు నీలం ఉన్నారు.

బూర్జ: మండలంలోని డొంకలపర్త, లక్కుపురం, అల్లెన, పాలవలస, మదనాపురం, బూర్జ, కొల్లివలస, చీడివలస, గుత్తావల్లి, లభాం, వోవీపేట, ఉప్పినివలస, వైకుంఠపురం తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు, యువత, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీలోని బ్రహ్మణవీధి, అచ్యుతాపురం, పెద్దలోగిడి, మద్దుమర్రి, పెద్దసరియాపల్లి గ్రామాల్లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు.అంజనేయ విగ్రహాలను తపలపాకులతో భక్తులు అలంకిరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కొత్తూరు: మండల వ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రత్యేక పూజలు, హోమాల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


పాతపట్నం: పెద్దలోగిడిలో తమలపాకుల అలంకరణలో అభయాంజనేయ స్వామి


నరసన్నపేట: జట్టు కళాసీ సంఘ భవనం వద్ద ఆంజనేయ స్వామికి పూజలు చేసేందుకు క్యూలో ఉన్న భక్తులు


సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో స్వామివారికి కుంకుమపూజలు చేస్తున్న భక్తులు


నరసన్నపేట: పెద్దపేట ఆలయంలో హనుమత్ పారాయణం చేస్తున్న రుత్వికులు

కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి

- నరసన్నపేట ఆర్వో రామ్మోహనరావు


మాట్లాడుతున్న ఆర్వో రామ్మోహనరావు

నరసన్నపేట: నరసన్నపేట నియోజకవర్గంలో పోలైన ఓట్లతో పాటు పోస్టల్ బ్యాలెట్, సర్వీసు ఓట్లు లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామ్మోహనరావు శనివారం తెలిపారు. మే 13వ తేదీన జరిగిన ఎన్నికల్లో 1,73,827 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారన్నారు. అలాగే సర్వీసు ఓట్లు ఇప్పటి వరకూ 978 వచ్చాయని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన పోలింగ్‌లో 2,974 వచ్చాయని, అలాగే ఈ నియోకవర్గంలో ఓటు ఉండి వేరే ప్రాంతాల్లో ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న వారి నుంచి 305 పోస్టల్ బ్యాలెట్లు వచ్చినట్టు పేర్కొన్నారు. హోం ఓటింగ్‌లో 111 బ్యాలెట్లు వచ్చాయన్నారు. మొత్తం 1,78,195 ఓట్లను లెక్కించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ నెల నాలుగో తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్లు లెక్కింపునకు మరో నాలుగు టేబుళ్ల ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో టేబుల్‌కు సూపర్‌వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు, మరో మైక్రో అబ్జర్వర్‌ను నియమించామన్నారు. అలాగే ఒక్కో టేబుల్ వద్ద ఒక్కో అభ్యర్థికి ఒక్కో పోలింగ్ ఏజెంట్‌కు పాస్‌లు ఇచ్చామన్నారు. సర్వీస్ ఓట్ల లెక్కింపునకు ఇచ్ఛాపురం మున్సిపల్ కమిషనర్‌కు కలెక్టర్ నియమించారన్నారు. పోస్టల్ బ్యాలెట్ల కోసం నాలుగు టేబుళ్లకు నియోజకవర్గంలోని నలుగురు తహసీల్దార్లను నియమించినట్టు చెప్పారు.

వంజంగిలో కార్డన్ సెర్చ్


పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

ఆమదాలవలస రూరల్: మండలంలోని వంజంగి గ్రామంలో ఎస్సై కె.వెంకటేష్ ఆధ్వర్యంలో శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతిఇంటికీ వెళ్లి అనుమానాస్పద వ్యక్తులు, ఎటువంటి ధ్రువపత్రాలు లేని వాహనాలపై ఆరా తీశారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలోలో ఎవరూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడవద్దని గ్రామస్తులకు సూచించారు. ఎవరైనా చట్టాలను అతిక్రమించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అందరూ కలిసి మెలిసి స్నేహంగా ఉండాలన్నారు. కార్డన్ సెర్చ్‌లో భాగంగా పత్రాలు లేని రెండు ద్విచక్ర వాహనాలను గుర్తించి సీజ్ చేశారు.

ప్రత్యేక అవసరాల పిల్లల సర్వేలో ప్రథమస్థానం


ఆమదాలవలస రూరల్: బెలమాంలో సర్వే చేస్తున్న సిబ్బంది

ఆమదాలవలస రూరల్: సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల పిల్లల కోసం నిర్వహిస్తున్న సర్వేలో జిల్లాలో ఆమదాలవలస మండలం ప్రథమస్థానంలో ఉందని ఎంఈవో బి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలో నిర్వహిస్తున్న సర్వేను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడిఈడు వయస్సు ఉన్న దివ్యాంగ పిల్లలను పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. బడిఈడు బయట గల దివ్యాంగ పిల్లలను పాఠశాలలో చేర్పించడానికి జూన్ తొమ్మిదో తేదీ వరకు చేపడుతున్న ప్రవేశాల సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. మండలంలో ఇప్పటి వరకు 38 మంది పిల్లలను గుర్తించినట్లు పేర్కొన్నారు. భవిత కేంద్రాల్లో దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక బోధన అందిస్తున్నట్లు తెలిపారు. శారీరక వైకల్యాలు నయం చేసేలా ఫిజియోథెరపీ చేయిస్తున్నామన్నారు. ఈ సర్వేలో సహిత ఉపాధ్యాయులు పూజారి శ్రీధర్, పి.ముత్యాలరావు ఉన్నారు.

బాధ్యతగా పిల్లల సర్వే

నరసన్నపేట: ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు, నమోదు కోసం సర్వేని బాధ్యతగా నిర్వహించాలని ఐఈసీవో జిల్లా కోఆర్డినేటర్ బుడుమూరు గోవిందరావు అన్నారు. స్థానిక ఐఈ కోఆర్డినేటర్లు కృష్ణవేణి, శ్రీనివాసరావులు చేస్తున్న సర్వేని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా సర్వే చురుగ్గా జరుగుతుంన్నారు. ఈ నెల తొమ్మిదో తేదీతో సర్వే ప్రక్రియ ముగుస్తుందని అన్నారు. మండలాల్లో ఉన్న ఐఈ కోఆర్డినేటర్లు మరింత బాధ్యతగా సర్వే పూర్తి చేయాలని కోరారు. నరసన్నపేటతో పాటు జమ్ము, తామరాపల్లిల్లో జరుగుతున్న సర్వేని గోవిందరావు పరిశీలించారు. ఈయన వెంట ఐఈ కోఆర్డినేటర్ ఉమా ఉన్నారు.

ఆర్బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలు

ఎల్.ఎన్.పేట: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాల కోసం రైతుల పేర్లు నమోదు చేయటం జరుగుతుందని ఏవో పైడి లతశ్రీ తెలిపారు. ఈ మేరకు శనివారం గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కట్టి జనుమ, జీలుగు విత్తనాల కోసం పేర్లు నమోదు చేయాలని, రైతుల నుంచి డబ్బులు తీసుకుని ఒకటి రెండు రోజుల్లో విత్తనాలు సరఫరా చేయాలని సూచించారు. కట్టిజనుమ, జీలుగ విత్తనాలు 50 శాతం రాయితీ విక్రయిస్తున్నట్లు వివరించారు. జీలుగు, కట్టి జనుమ పది కిలోలు ప్యాకెటు రాయితీ పోను ధర రూ.440 ఉందన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున విత్తనాలు వేసుకోవాలని రైతులకు సూచించారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

పాతపట్నం:స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు శనివారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. వివిధ రకాల బొమ్మలను విద్యార్థులు వేశారని రిసోర్స్‌పర్సన్ పి.ఆనందరావు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కాళ్ల రాజు, ఉపాధ్యాయుడు కిల్లారి శ్యామ్‌బాబు, బి.బెనర్జి, పాఠకులు పాల్గొన్నారు.

ర్యాలీలు, ఊరేగింపులు రద్దు

- పాతపట్నం సీఐ నల్లి సాయి



పాతపట్నం: ఈ నెల నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి నేపథ్యంలో అందరూ శాంతియుతంగా వ్యవహరించాలని, ఎట్టిపరిస్థితుల్లోనూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించకూడదని పాతపట్నం సీఐ నల్లి సాయి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పాతపట్నం పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. పాతపట్నం నియోజకవర్గంలో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ఐదుగురు వ్యక్తులతో చట్టవిరుద్ధమైన సమావేశాలు, బహిరంగ సభలు పెట్టరాదన్నారు. ఎగ్జిట్ పోల్స్ వచ్చిన తర్వాత కూడా సమావేశాలు పెట్టరాదన్నారు. గ్రామాల్లోకి బయట వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించడానికి వీలులేదన్నారు. ఫలితాలు వెల్లడి సమయంలో అన్ని గ్రామాల్లోను పోలీసులు నిఘా ఉంటుందని, శాంతిభద్రతల నిర్వహణ కోసం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు.ఆయనతో పాటు ఎస్ఐ మహమ్మద్ యాసీన్ ఉన్నారు.

96 శాతం పింఛన్లు పంపిణీ


రాణా సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న దామోదరరావు

జలుమూరు: జలుమూరు మండలంలోని 24 సచివాలయాల పరిధిలో 96 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీవో దామోదరరావు చెప్పారు. రాణా గ్రామ సచివాలయంలో పింఛన్ల పంపిణీని శనివారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు.

మొత్తం పింఛన్లు 9,742 కాగా.. డోర్‌టూడోర్ పింఛన్లు బెడ్ రీజియన్, దివ్యాంగులు, వేలిముద్రలు పడనివారు 2,341 మంది ఉన్నారన్నారు. వీరిలో 2,234 వరకూ పంపిణీ పూర్తయిందన్నారు. మిగిలిన పించన్లు ఆయా బ్యాంక్ ఖాతాలకు జమ చేసినట్టు పేర్కొన్నారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన


కొత్తూరులో పింఛన్ల పింపిణీని పరిశీలిస్తున్న త్రివిక్రమరావు

కొత్తూరు: పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఎంపీడీవో త్రివిక్రమరావు శనివారం పరిశీలించారు. దివ్యాంగులు, వృద్ధులు, దీర్ఘకాలం వ్యాధులతో బాధపడుతున్న పింఛన్‌దారులకు వారి ఇళ్లవద్దకే సచివాలయ సిబ్బంది వెళ్లి పింఛన్లు అందిచారు. మండలంలో 90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్టు ఎంపీడీవో చెప్పారు. చాలామందికి బ్యాంకు ఖాతాల్లో పింఛన్ల మొత్తాన్ని జమ చేశామన్నారు.

మరింత నాణ్యతగా గోరుముద్ద


మాట్లాడుతున్న ఎంఈవోలు

జలుమూరు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గోరుముద్ద పథకంలో భాగంగా మధ్యాహ్న భోజనాన్ని మరింత నాణ్యతగా అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తసుకుంటుందని ఎంఈవోలు బి.మాధవరావు, ప్రసాదరావు అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులకు తాజ్ హోటల్‌లో శిక్షణ పొందిన సిబ్బందికి శనివారం అవగాహన కల్పించారు. అలాగే అగ్ని ప్రమాదాలు ఏర్పడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మిడ్డేమీల్స్ రుచి,శుచి,శుభ్రతతో తయారు చేసే విధానంపై ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. పాఠశాలలు తెరిచేనాటికి వంట పాత్రలు, వంట గదులతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. శిక్షకులు ఉత్తర, హెచ్ఎం వేణుగోపాలరావు, సీఆర్‌పీలు పట్ట వైకుంఠరావు, శంకరరావు, రవి, నదుపూరి డిల్లేశ్వరరావు, మాధవి, సరస్వతి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి ఔదార్యం

- సొంత నిధులతో నారాయణపురం హైలెవెల్ కాలువ మరమ్మతులు


కాలువ పనులను పరిశీలిస్తున్న రవికుమార్ తదితరులు

ఆమదాలవలస: ఆమదాలవలస, బూర్జ మండలాల్లో సుమారు ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందించే నారాయణపురం ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్‌లో మట్టి పూడుకుపోయింది. దీంతో సాగునీరు సక్రమంగా రావడంలేదు. ఈ సమస్యను ఆయా ప్రాంతాల రైతులు వైఎస్సార్‌సీపీ ప్రచారవిభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వ నిధులతో ఆ పనులు నిర్వహించడానికి అవకాశం లేదు. దీంతో సుమారు రూ. నాలుగు లక్షల సొంత నిధులతో కాలువలో పూడిక తీత పనులు చేయించారు. గండి పడిన కాలువ గట్లకు రవికుమార్ మరమ్మతులు చేయిస్తున్నారు. బూర్జ మండలం చీడివలస దగ్గర నుంచి ఆమదాలవలస మున్సిపాలిటీ రావికంటిపేట వరకు గల ఈ కాలువ మరమ్మతులను రైతులతో కలిసి దగ్గరుండి చేయిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే ఈ పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో గత 20 రోజులుగా పనులను రైతుల సహకారంతో చేయిస్తున్నారు. ఈ పనులను శనివారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. సొంత నిధులను ఖర్చు చేస్తున్న రవికుమార్‌కు రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.